# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సంపుటి : 1 సంచిక : 07 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 18 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 07 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 18 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur






# సౌదీ రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతి


## మృతులంతా హైదరాబాదీలేనని హజ్ కమిటీ ప్రకటన



- సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతి
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉన్నారని అధికారిక ప్రకటన
- ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనా వెళ్తుండగా బస్సు, ట్యాంకర్ ఢీ
- మృతుల సంఖ్యను ధృవీకరించిన తెలంగాణ హజ్ కమిటీ
- హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన కుటుంబంలో తీరని శోకం

వివరాలు 2లో..

## సౌదీ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, జగన్ ప్రగాఢ సానుభూతి



- సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రికుల బస్సు ప్రమాదం
- మృతుల్లో అత్యధికులు తెలంగాణ వాసులుగా వెల్లడి
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- మాజీ సీఎం జగన్, మంత్రి లోకేశ్, షర్మిల సంతాపం
- మృతదేహాలను రప్పించాలని కేంద్రానికి షర్మిల విజ్ఞప్తి

# ఈ నెల 19న 'అన్నదాత సుఖీభవ'- పీఎం కిసాన్ నిధుల జమ

- రైతుల ఖాతాల్లోకి రెండో విడతగా రూ.7 వేలు జమ
- కమలాపురంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఈనెల 19న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల జమకు రంగం సిద్ధం అయ్యింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరకి అన్నదాత సుఖీభవ పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టండి అని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. రైతులు అర్హత వివరాలు ఆన్‌లైన్‌లో సులభతరంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఈ నెల 19న రెండో విడత నిధులు జమ చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం టెక్కలి నియోజకవర్గంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి , డైరెక్టర్, 26 జిల్లాల

వివరాలు 2లో..

## 'ఐబొమ్మ'ను పూర్తిగా మూసివేశాం.. క్షమించండి

### ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అధికారిక సందేశం




- ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- అతని చేతే వెబ్‌సైట్లను మూయించిన హైదరాబాద్ పోలీసులు
- దేశంలో సేవలు శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెబ్‌సైట్‌లో సందేశం
- భార్య ఇచ్చిన సమాచారంతో కూకట్‌పల్లిలో పట్టుబడ్డ నిందితుడు
- కరీబియన్ దీవుల నుంచి పైరసీ దందా నిర్వహణ

పెన్ పవర్ డెస్క్:తెలుగు సినీ పరిశ్రమకు కొంకరాని కొయ్యగా మారిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' తన సేవలను శాశ్వతంగా నిలిపి వేసింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా, "మీరు ఇటీవల మా గురించి విని ఉండవచ్చు లేదా

వివరాలు 2లో..

## షేక్ హసీనాకు మరణశిక్ష... ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- షేక్ హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే అభియోగాలు
- షేక్ హసీనాను దోషిగా తేల్చిన అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్
- మరణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిన ట్రైబ్యునల్



పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్‌లో గత సంవత్సరం జరిగిన అల్లర్ల కేసులో దోషిగా తేలిన మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పును వెలువరించింది.

వివరాలు 2లో..



## సంచలన ఆదేశాలు ఇవ్వలేం

### ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న సుప్రీంకోర్టు
- రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు నిరాకరణ
- పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది.

## దొంగలు దొరికిపోతారనే భయంతోనే సతీష్ కుమార్‌ను అంతమొందించారు

- టీటీడీ పరకామణిలో రూ.100 కోట్ల చోరీ జరిగిందన్న మంత్రి పార్థసారథి
- ఫిర్యాది సతీష్ కుమార్‌ను హత్య చేశారని ఆరోపణ
- వివేకా హత్య తరహాలోనే దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నమని వ్యాఖ్యలు
- నెల రోజుల్లోనే ఛార్జ్‌షీట్, రాజీ కుదర్చడంపై తీవ్ర అనుమానాలు

వివరాలు 2లో..



## 'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది.. రూ. 20 కోట్లు సంపాదించాడు

- ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- పైరసీ ద్వారా రూ.20 కోట్లు సంపాదించినట్లు వెల్లడి
- పైరసీ ముసుగులో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు గుర్తింపు




పెన్ పవర్ డెస్క్:తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం కలిగిస్తున్న ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో ఆయన విస్తుపోయే నిజాలను మీడియా ముందుంచారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్ రాజు తదితరులు సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఐబొమ్మ నిర్వాహకుడిని పట్టుకున్నందుకు

వివరాలు 2లో..

## బాలయ్య జోలికి వస్తే చర్మం ఒలిచేస్తా

### వైసీపీకి ఎమ్మెల్యే మాస్ వార్నింగ్

- హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తల దాడి
- బాలకృష్ణపై వైసీపీ నేతల వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- కొందరు చిల్లర వెధవలు బాలయ్య గురించి మాట్లాడారన్న ఎమ్మెస్ రాజు



పెన్ పవర్ డెస్క్:వైసీపీకి శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తన అభిమాన నటుడు, హిందూ పురం

వివరాలు 2లో..

## ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే.. తీవ్ర పరిణామాలు

### పాక్‌కు ద్వివేదీ హెచ్చరిక




- ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగించవద్దని హెచ్చరిక
- ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చేవారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని స్పష్టీకరణ
- అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వి వేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులను, వా రి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణి

వివరాలు 2లో..




# వైసీపీ చూస్తోంది.. జనసేన దూసుకుపోతోంది.. !

ఏపీ ప్రతిపక్షం(ప్రధాన కాదు) వైసీపీ ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతోందా? అనే విషయాలను ఆసక్తిగా పరిశీ లిస్తోంది. ముఖ్యంగా కూటమి పార్టీల్లో తప్పులను వెతికేందుకు మాత్రమే వైసీపీ పరిమితం అవుతోందన్న చర్చ కూడా సాగుతోంది. కానీ.. అవే కూటమి పార్టీలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఎవరి శాఖలను వారు ముందుకు నడిపిస్తున్నారు. మధ్యంలో చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా.. సర్దుకు పోతున్నారు.కానీ, ఇదేసమయంలో వైసీపీ మాత్రం పని వదిలేసి పరిశీలనకే పరిమితం అయిందన్న వాదన వినిపిస్తోం ది. మరీ ముఖ్యంగా కూటమి కట్టేందుకు, దానిని ముందుకునడిపించేందుకు కీలకంగా వ్యవహరించిన జ నసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారా? అని వైసీపీ మరింత ఎక్కువగా పరిశీ లన చేస్తోంది. ఈ పరిణామాలు.. జనసేనపై కంటే కూడా.. వైసీపీ పైనే ఎక్కువగా ప్రభావం చూపుతున్నా యి. ఎందుకంటే.. చూస్తూ కూర్చుంటే అక్కడే ఉండిపోతాం.. చేస్తూ ఉంటే ముందుకుసాగుతాం అనే సామెత గుర్తుంది కదా!.

అలానే.. వైసీపీ ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. కానీ.. జనసేన మాత్రం గిరిజన ప్రాబల్య నియోజకవర్గాల్లో జెండా పాతేస్తోంది. ఇది వైసీపీకి అత్యంత ప్రమాదకరమైన సంకేతం. ఎందుకంటే.. ఇప్పటి వరకు వరకు పార్టీ ఓడినా గెలిచినా.. గిరిజనులు జగన్ వెంటే ఉన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. దీనిని పసిగట్టినా.. జనసేన దూకుడుగా ఉందన్న విషయం తెలిసినా.. వైసీపీ ఎక్కడా ఉలకడం లేదు. పలకడం కూడా లేదు.ఇక, మరో కీలక విషయం.. గ్రామీణ ప్రాంతాల్లోనూ జనసేన దూకుడు పెంచింది. ఇది కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా వైసీపీని ఇరుకున పడేసే వ్యవహారమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు టీడీపీ-వైసీపీ బలంగా ఉన్నాయి. ఇప్పుడు వైసీపీ ఓటు బ్యాంకును తనవైపు తిప్పుకొనేలా జనసేన కూడా వ్యూహాత్మక రాజకీయాలు చేస్తోంది. ఈ పరిణామాలతో గ్రామీణ ప్రాంతంలో జనసేనవికాసం మరో మెట్టు దూరంలోనే ఉందన్న చర్చ పార్టీలో వినిపిస్తోంది. అయినా.. వైసీపీలో కదలిక లేదు. ఆ పార్టీ చూస్తూ కూర్చుంటే.. జనసేన మాత్రం చేసుకుంటూ పోతుండడం గమనార్హం.

# దొంగలు దొరికిపోతారనే భయంతోనే సతీష్ కుమార్‌ను అంతమొందించారు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణిలో జరిగిన రూ.100 కోట్ల విదేశీ కరెన్సీ చోరీ కేసులో దొంగలు దొరికిపోతారనే భయంతోనే నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్‌ను అంతమొందించారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల పవిత్రతను మంటగలిపి, దోపిడీకి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల క్షేత్రంలో గత పాలకులు రాజకీయ కుట్రలకు, దోపిడీకి పాల్పడటం భక్తులను తీవ్రంగా కలిచివేసిందన్నారు. టీటీడీ పరకామణిలో ఏకంగా వంద కోట్ల రూపాయల విదేశీ కరెన్సీ చోరీ జరిగిందన్న వార్త ఆవేదనకు గురిచేసిందన్నారు. 2023 ఏప్రిల్ 29న నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశారని, అయితే ఇంత భారీ దోపిడీకి సాధారణ సెక్షన్లు నమోదు చేయడం వెనుక కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దోపిడీ ముఠా పనిలా ఈ వ్యవహారం నడిచిందన్నారు.ఈ కేసు దర్యాప్తు తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని పార్థసారథి అన్నారు. కేసు పెట్టిన నెల రోజుల్లోపే, అంటే మే 31న ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, ఆ మరుసటి రోజే (జూన్ 1న) ఫిర్యాది సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ కలిసి కోర్టులో రాజీ మెమో దాఖలు చేయడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందో తేలాలన్నారు. రూ.100 కోట్ల దోపిడీకి బదులుగా నిందితుడు రూ.14.5 కోట్ల ఆస్తులను టీటీడీకి 'దానం' చేసినట్లు చూపించి కేసును నీరుగార్చారని ఆరోపించారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే సతీష్ కుమార్ రాజీకి అంగీకరించినట్లు విజిలెన్స్ నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి వెనుక పెద్ద కుట్ర ఉందని పార్థసారథి అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించినట్లే, సతీష్ కుమార్ మరణాన్ని కూడా ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సతీష్ సోదరుడు ఇది హత్యేనని చెబుతున్నా, పోలీసుల కంటే ముందే టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆత్మహత్యగా ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజీ వ్యవహారం కూడా భూమన ఛైర్మన్ అయిన నెల రోజుల్లోనే జరగడంపై లోతైన దర్యాప్తు అవసరమన్నారు.గతంలో పరిటాల రవి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో సాక్షులు చనిపోయినట్లే, ఈ కేసులోనూ సాక్షులను లేకుండా చేసే కుట్ర జరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తును వ్యతిరేకించిన వైసీపీ నేతలు, ఇప్పుడు ఈ కేసులో సీబీఐ విచారణ కోరడం వాస్తవాలను నీరుగార్చే ప్రయత్నమేనని విమర్శించారు. గత ప్రభుత్వానికి తిరుమల శ్రీవారిపై భక్తి, గౌరవం లేవని, పవిత్ర క్షేత్రాన్ని దోచుకోవడానికి ఒక అవకాశంగా మాత్రమే చూశారని పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో దోషులు ఎంతటి వారైనా సరే, వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వం తరఫున ఆయన హామీ ఇచ్చారు.

# సౌదీ రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతి...

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది.

**ప్రమాదం జరిగిందిలా...!**

సోమవారం తెల్లవారుజామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు.

**ఒకే కుటుంబంలో తీరని శోకం**

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**అధికారుల స్పందన, దర్యాప్తు**

ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకే నగరం నుంచి, ముఖ్యంగా ఒకే కుటుంబం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం హైదరాబాద్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# సౌదీ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, జగన్ ప్రగాఢ సానుభూతి

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణకు చెందిన పలువురు ఉమ్రా యాత్రికులు మరణించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహా పలువురు నేతలు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. "పవిత్ర ఉమ్రా యాత్రలో తెలంగాణకు చెందిన మన సోదర సోదరీమణులు మరణించారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.మదీనా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 42 మంది భారతీయులు మరణించడం హృదయ విదారకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మృతుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ వాసులు కావడం బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "సౌదీలో జరిగిన ప్రమాదం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రార్థనలు ఉంటాయి" అని జగన్ పోస్ట్ చేశారు.

అదేవిధంగా మంత్రి నారా లోకేశ్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని, మృతదేహాలను గౌరవప్రదంగా స్వదేశానికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని షర్మిల కోరారు.

# ఈ నెల 19న 'అన్నదాత సుఖీభవ'- పీఎం కిసాన్ నిధుల జమ

- మొదటి పేజి తరువాయి

జేడీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పలు సూచలను అధికారులకు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు అదేరోజు విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా కలిపి రైతుల ఖాతాల్లో జమ చేయనున్న నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో కలిపి మొత్తం రూ.7వేలు అందించనున్నామని రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఈనెల 19న రైతు ఖాతాలో నగదు జమ

రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యత అని గుర్తెరగాలి అ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 19న వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అధికారులు... ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. %చీాజూా%లో ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలని క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పర్యవేక్షణ చేసి వాటిని సరిచేయాలని సూచించారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

**రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ**

అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్లైన్‌లో రైతులు నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండో విడత 46,62,904 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని అధికారులు మంత్రి అచ్చెన్నాయుడుకి వివరించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు విడుదల చేయనున్నాయని చెప్పారు. ఈ పథకంపై సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అన్నదాత సుఖీభవ అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒక రోజు ముందే ' సందేశాలు వెళ్లాలి. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలి' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**అర్హత కలిగిన రైతులకు పథకం అమలు**

తొలి విడతలో జమకానివి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి అర్హత ఉన్న వారికి అన్నదాత సుఖీభవ పథకం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో జరగాలని అధికారులకు సూచించారు. వెబ్‌ల్యాండ్‌లో నమెదు కానివి, అర్హత ఉన్నవారికి అందలేదని రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులు పరిశీలించి అర్హత ఉన్న రైతులకు పథకం అందేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. కింది స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

# ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే.. తీవ్ర పరిణామాలు

- మొదటి పేజి తరువాయి

స్తుందని.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాద ముఠాలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని జనరల్ ద్వివేది అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామన్నారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని.. రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం బ్లాక్‌మెయిళ్లకు భయపడే స్థితిలో భారత్ లేదని.. శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఒక్కతాటిపై పని చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందన్నారు.

ఇంతకు ముందుతో పోల్చితే పొరుగు దేశమైన చైనాతో భారత్ సంబంధాలు బలపడుతున్నాయని ద్వివేది పేర్కొన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగినట్లు తెలిపారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు.. భారత్- చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# బాలయ్య జోలికి వస్తే చర్మం ఒలిచేస్తా

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యే బాలకృష్ణ జోలికి వస్తే చర్మం ఒలిచేస్తామంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. తాను బాలయ్య అభిమానిగా ఈ హెచ్చరిక చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.హిందూపురంలో బాలకృష్ణపై కొందరు వైసీపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే ఈ వివాదం మొదలైందని రాజు పేర్కొన్నారు. "హిందూపురంలో కొందరు చిల్లర వెధవలు బాలయ్య గురించి మాట్లాడారు. దీంతో ఆవేశానికి లోనైన మా కార్యకర్తలు వైసీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఇది మీకు, మీ అధినేతకు కూడా మా హెచ్చరిక" అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, హిందూపురంలోని వైసీపీ కార్యాలయంతో పాటు, పార్టీ ఇన్చార్జ్ దీపిక రెడ్డి భర్త కార్యాలయంపై కూడా టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# 'ఐబొమ్మ'ను పూర్తిగా మూసివేశాం.. క్షమించండి

- మొదటి పేజి తరువాయి

మొదటి నుండి మాకు నమ్మకమైన అభిమానిగా ఉండవచ్చు. ఏదేమైనా, మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపివేయబడ్డాయని చెప్పడానికి మేము చింతిస్తున్నాము. నిరాశకు మేము క్షమాపణలు కోరుతున్నాము" అనే సందేశం కనిపిస్తోంది. ఈ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని ఇటీవల హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి, కరీబియన్ దీవులలో నివసిస్తూ ఐబొమ్మ, బప్పం టీవీ వంటి పైరసీ వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నాడు. కొత్త సినిమాల మాస్టర్ ప్రింట్లను దొంగిలించి వాటిని అప్‌లోడ్ చేయడం ద్వారా భారీగా డబ్బు సంపాదించాడు. అయితే, తన భార్యతో విడాకుల ప్రక్రియ కోసం భారత్‌కు వచ్చినప్పుడు ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. కూకట్‌పల్లిలోని అతని నివాసంలో రవిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం, పోలీసులు రవి చేతే ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను పూర్తిగా మూసివేయించారు. ఈ పైరసీ దందా ద్వారా సంపాదించిన డబ్బుతో రవి హైదరాబాద్‌లో సుమారు రూ. 3 కోట్ల విలువైన ఇల్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాజా పరిణామంతో ఈ రెండు వెబ్‌సైట్లు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి.

# షేక్ హసీనాకు మరణశిక్ష... ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- మొదటి పేజి తరువాయి

మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. వాదనలు విన్న ట్రైబ్యునల్ ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత సంవత్సరం రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి అవామీ లీగ్ గద్దె దిగడానికి కారణమైంది. ఆందోళనకారుల బారి నుంచి తప్పించుకోవడానికి షేక్ హసీనా ప్రత్యేక విమానంలో భారత్‌కు వచ్చారు. ఏడాదికి పైగా ఆమె ఢిల్లీలోని గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఆమెకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. తనపై జరిగిన సుదీర్ఘ విచారణను ఇటీవల షేక్ హసీనా న్యాయశాస్త్రంలో ఒక జోక్‌గా అభివర్ణించారు. షేక్ హసీనా పాలన ముగిసి, తాత్కాలిక యూనస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. 2026 ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో రాజకీయంగా అస్థిరత నెలకొంది.

## 'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది.. రూ. 20 కోట్లు సంపాదించాడు

- మొదటి పేజి తరువాయి

సైబర్ క్రైమ్ పోలీసులను వారు అభినందించారు.ఈ భేటీ అనంతరం సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. పైరసీ దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని ఎట్టకేలకు అరెస్ట్ చేశాం. బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన వేలాది సినిమాలను ఇతను పైరసీ చేశాడు. పైరసీ ద్వారా సుమారు రూ.20 కోట్లు సంపాదించినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.3 కోట్లు స్వాధీనం చేసుకున్నాం" అని తెలిపారు.రవి వద్ద సుమారు 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, ఈ డేటాను దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉందని సజ్జనార్ హెచ్చరించారు. పైరసీ వెబ్‌సైట్ల ముసుగులో బెట్టింగ్ యాప్‌లను కూడా ప్రమోట్ చేశారని, దీనివల్ల ఎంతో మంది యువకులు ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరోదాన్ని సృష్టిస్తూ.. రవి మొత్తం 65 మిర్రర్ వెబ్‌సైట్లను నడిపినట్లు గుర్తించారు.ఇమ్మడి రవికి ముందు నుంచే నేర చరిత్ర ఉందని, మహారాష్ట్రలో ప్రహ్లద్ పేరుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ సృష్టించాడని సజ్జనార్ తెలిపారు. కరేబియన్ దీవుల్లో పౌరసత్వం కూడా తీసుకున్నాడని, అమెరికా, నెదర్లాండ్స్‌లో సర్వర్లు ఏర్పాటు చేసి ఈ పైరసీ సామ్రాజ్యాన్ని నడిపాడని వివరించారు. ఈ కేసులో గతంలోనే దుద్దెల శివరాజ్, ప్రశాంత్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశామని, రవిపై ఐటీ, కాపీరైట్ చట్టాల కింద మొత్తం 5 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# సంచలన ఆదేశాలు ఇవ్వలేం

- మొదటి పేజి తరువాయి

కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది.ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

# ఎండిన చెట్టు విరిగిపడితే చేటు

**సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 17:**సీతానగరం మండలంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రధాన రహదారి ప్రక్కన ఒక ఎండిన చెట్టు ప్రమాదకరంగా నిలిచింది. దీని కొమ్మలు ఎప్పుడైనా విరిగిపడే అవకాశం ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెట్టు ప్రక్కనే కార్లు బైకులు నిలిపి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజు ఆ మార్గంలో విద్యార్థులు వృద్ధులు మహిళలు నడుచుకుంటూ వెళ్తుంటారు. ఏ క్షణానైనా కొమ్ములు విరిగి పడతాయేమోనని భయపడుతున్నారు. ఈ చెట్టును తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# కాంగ్రెస్ వాష్ఔట్ తప్పదు



**– కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ**

**పెన్ పవర్ – భీమవరం పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం :**
కేంద్ర స్టీల్ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ఆదివారం భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పూర్తిగా వాష్ఔట్ అవుతుందని అన్నారు. బీహార్ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ మత వివాదాన్ని తిరిగి తెరపైకి తెచ్చినా, ప్రజలు మాత్రం బీజేపీ, ఎన్డీఏ కూటమికి ఆశీర్వాదం అందించారని పేర్కొన్నారు.
బీహార్‌లో ప్రజలు రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిషోర్ కు తగిన గుణపాఠం చెప్పారు. సర్వేలు చేస్తే సరిపోతుంది కానీ స్వంత పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావాలని కలలు కనడం ప్రజలు తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంపై**
విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల అంశంలో సీఎం చంద్రబాబు మాటలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తాజాగా విశాఖలో నిర్వహించిన సమ్మిట్ ఘనవిజయాన్ని సాధించిందని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద స్థాయి పెట్టుబడుల సమ్మిట్ ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు.
సమ్మిట్ ద్వారా భారీ పెట్టుబడులు
613 %మీఖ% లు కుదిరాయి
16 లక్షలకు పైగా యువతకు ఉద్యోగావకాశాలు
ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు వ్యాపారవేత్తలు భారీగా ముందుకు వస్తున్నారని తెలిపారు.
ఎన్డీఏ ప్రభుత్వంతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందని, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు.
వైఎస్ఆర్ కాంగ్రెస్ పాలనలో అనేక పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయని ఆరోపించారు.
స్టీల్ రంగంలో కొత్త రూపకల్పన
స్టీల్ శాఖ మంత్రిగా పనిచేయడం గర్వంగా ఉందని పేర్కొన్న ఆయన, %జ××% సదస్సులో మరో కొత్త స్టీల్ ప్లాంట్‌కు రూపకల్పన చేశామని, విజయనగరం జిల్లా కండ్ల గ్రామంలో 8,500 కోట్ల పెట్టుబడితో 2 మిలియన్ టన్నుల కెపాసిటీ కలిగిన ప్లాంట్ ఒప్పందం కుదిరిందని వెల్లడించారు.
వందే భారత్ ట్రైన్ అప్‌డేట్
వందేభారత్ రైలు సేవను జనవరి 12కు ముందే ప్రారంభించేలా కృషి చేస్తున్నామని తెలిపారు.



### పీజీఆర్ఎస్ అర్జీదారుల్లో అసంతృప్తి
# రాకుండా అధికారులు సమస్యలు పరిష్కరించాలి

* పీజీఆర్ఎస్ జిల్లా స్థాయిలో మొత్తం 156 అర్జీలు
* జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 17**
పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఆర్జీలు పరిష్కారం లభించక ప్రజలు అసంతృప్తిలో ఉన్నారని ఫిర్యాదు దారుల్లో అర్జీ దారుల్లో , ప్రతికూల ప్రభావం చూపుతోందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్‌తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, అన్ని శాఖలు తమ పనితీరులో స్పష్టత, వేగం, బాధ్యత వహించాలని సూచించారు. అర్జిల పరిష్కార మార్గంలో ప్రజల సంతృప్తి స్థాయి పై రాష్ట్ర ప్రభుత్వం ఐ వి ఆర్ ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోందని వెల్లడించారు. అందులో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు పరిష్కారం అయ్యే వాటిలో వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. మత్స్యకారులకు లైసెన్సులు జారీ చేయడంలో రెవెన్యూ శాఖ మత్స్యశాఖ సమన్వయం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా ఉద్యోగుల సేవా నైపుణ్యాభివృద్ధి కోసం కర్మయోగి యాప్‌లో ఉన్న శిక్షణ కోర్సులను గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత కింద రైతులకు పెట్టుబడి సాయం నిధులు పంపిణీకి జిల్లా స్థాయిలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 156 అర్జీలు స్వీకరించారు . వాటిలో రెవెన్యూ శాఖకు 66, పంచాయ తీరాజ్ %-%గ్రామీణాభివృద్ధికి 23, హోమ్ శాఖకు 22, మున్సిపల్ శాఖకు 6 ఫిర్యాదులు చేరాయి. స్కూల్ రికార్డు సరిచేయడం, చెరువు ఆక్రమణ నివేదిక, దీపం పథకం సొమ్ము జమ సమస్య, బోధి మార్గం ఆక్రమణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారి తక్షణంగా చర్యలు తీసుకోవాలని ఆమెఆదే శించారు. జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, డీ ఆర్వో టి సీతారామ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాకినాడ ఎస్ఈజెడ్ భూముల బదిలీ ప్రక్రియను వేగవంతం చేయాలి





**కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 17:**కాకినాడ ఎస్ఈజెడ్ భూములను రైతుల పేరున బదిలీ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ, కెఎస్ఈజెడ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎస్ఈజెడ్ భూముల బదిలీపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్, భూముల వివరాలు, చర్యల పురోగతిని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.తదుపరి ఆయన మాట్లాడుతూ యువరాజుపేట, కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ పరిధిలోని 1189 ఎకరాల భూమిని 1,545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూముల రిజిస్ట్రేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయింపుగా ప్రకటించినట్లు గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో బదిలీ చర్యలను ప్రత్యేక దృష్టితో పర్యవేక్షించి, రెవెన్యూ, కెఎస్ఈజెడ్, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి భూముల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమీక్ష సమావేశంలో కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో కె. శ్రీరమణి, జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి, పాడా పీడీ చైత్ర వర్షిణి, ఎస్ఈజెడ్ ఇన్‌చార్జి ఎస్డీసీ పి. వేణుగోపాలరావు, సెజ్ జీఎం ఎం. శ్రీనివాసు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్తిక వన సమారాధనలతో ఆధ్యాత్మికత, ఆహ్లాదం.
### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 17:**కార్తిక వన సమారాధనలతో సమాజంలో ఆధ్యాత్మిక వాతావరణం పెరగడంతో పాటు ఆహ్లాదం లభిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. సోమవారం ఆలమూరులో సూరపురెడ్డి (బట్టి) సూర్యనారాయణ, వారి కుమారుల ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. అందరూ ఒక చోట చేరి సహపంక్తి భోజనాలు చేయడానికి వన సమారాధనలు దోహదం చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,సలాది నాగేశ్వరరావు,ఈదల రాంబాబు,వంటిపల్లి పాపారావు, కేతా రాంబాబు,ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# రజకుల సంక్షేమానికి కృషి చేస్తా





### అసంపూర్తి కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేస్తా
### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్, నవంబర్ 17**:రాష్ట్రంలో రజకుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ ఆవరణలో రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ అధ్యక్షులు కాకినాడ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రజకుల వన సమారాధన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, నిబంధనల ప్రకారం చెరువుల కేటాయింపు, రుణాల మంజూరు, పనిముట్ల పంపిణీ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్‌ను తాను స్వయంగా చూసుకుని త్వరితగతిన పూర్తి చేస్తానని ప్రకటించారు. వన సమారాధన వంటి కార్యక్రమాలు జాతిలో ఐక్యతకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.గుంటూరు–2 ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూరజకులను గుర్తించి ఎమ్మెల్యే సీటు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచిందని కృతజ్ఞతలు తెలిపారు. రజకుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు మాట్లాడుతూ బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి, మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఇప్పటికే ఎస్సీల్లో చేర్చబడిన విషయాన్ని గుర్తు చేశారు. జీవో 344 ప్రకారం ప్రతి గ్రామంలో రజకులకు చెరువులు కేటాయించాలని కూడా డిమాండ్ చేశారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఏఎంసీ డైరెక్టర్ కేశనకుర్తి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు కంచుమర్తి బాబురావు, నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సూది కొండ రాముడు, మాజీ కౌన్సిలర్ కోటిపల్లి శివాజీ తదితరులు మాట్లాడుతూ
ఐకమత్యంతో కృషి చేస్తే రజకుల సమస్యలన్నీ సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రజక సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నిత్యావసర సరుకులు అందజేత



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 17:** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుర్గారావు అనే వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జగ్గంపేట మణికర్ణిక యువజన సంఘం సోమవారం ఒక నెలకు సరిపడా కిరాణా సరుకులు అందించారు. దుర్గారావు దీర్ఘకాలికంగా శ్వాస కోసం బాధపడుతూ ఆహారం తినలేక కేవలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకోగలుగుతున్నాడు. ఈ సందర్భంగా మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనుష మాట్లాడుతూ ఇటువంటి వారిని గుర్తించి సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు, మణికర్ణిక ఉపాధ్యక్షులు మొగలంక శ్రీనివాస్, సంఘ సభ్యులు మణికంఠ, వీరబాబు, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇర్రిపాక శివ కేశవుల క్షేత్రంలో మహా పంచామృతాభిషేకం





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 17:** కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని ఏలేరు నది తీరాన వేయించేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వేంచేసి ఉన్న శివకేశవుల దేవస్థానం నందు సోమవారం ఉదయం 6 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు శివ కేశవులు ఇరువురికి ఏకకాలంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు, ఆలయ ధర్మకర్త జ్యోతుల నెహ్రూ మణి దంపతులు చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వేలాదిగా విచ్చేసిన భక్తులు తమ స్వహస్తాలతో ఒక వెయ్యి 108 బిందెల ఏలేరు నదీ జలాలతో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు, ఎస్ వి ఎస్ అప్పలరాజు దంపతులు, జీను మణిబాబు దంపతులు, వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, తోట రవి, తోట గాంధీ, పైడిపాల సూరిబాబు, భూపాలపట్నం ప్రసాద్, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బస్వా చినబాబు, జ్యోతుల నాగబాబు, జ్యోతుల సత్యమూర్తి, సుంకవిల్లి రాజు, వేలాదిక భక్తులు పాల్గొన్నారు.

# ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల సందోహం





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్17**
కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా ర్యాలి గ్రామంలోని ప్రాచీన శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునే స్వామివారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చి ఆలయ ద్వారాల వద్ద నుంచే క్యూ లైన్లు ఏర్పడ్డాయి. కార్తీక సోమవారం పుణ్యకాలం కావడంతో కోనసీమలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా చేరుకున్నారు.

ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ధ్వజస్తంభం వద్ద మహిళా భక్తురాళ్లు దీపారాధనలు నిర్వహించి, కార్తీక దీపాలతో జ్యోతులను వెలిగించారు. దీపాల వెలుగులు, మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలతో ఆలయ పరిసరాలు భక్తిపరమైన సందడితో మార్మోగాయి.స్వామివారికి భక్తులు తైలాభిషేకం, పంచామృతాభిషేకం, విశిష్ట అర్చనలు సమర్పించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను శాస్త్రీయంగా నిర్వహించారు. భక్తులు తులసి, బిల్వదళాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో దేవస్థాన అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. క్యూ లైన్లను క్రమబద్ధీకరించి, ఆరోగ్య, త్రాగునీరు, పార్కింగ్ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు.

స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి నిల్చోవాల్సి వచ్చినప్పటికీ భక్తులు ఎలాంటి అలసట లేకుండా భక్తిపూర్వకంగా దర్శనం చేసుకున్నారు. కార్తీకమాసంలో ప్రతి సోమవారం రద్దీ అధికంగా ఉండగా, నాల్గవ సోమవారం కావడంతో ఈసారి రద్దీ మరింత పెరిగిందని ఆలయ అధికారులు తెలిపారు.

కార్తీక దీపాల వెలుగులతో ర్యాలి శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక జ్యోతితో మెరుస్తూ, దేవాలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి.

# మీకోసంలో అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నూటికి నూరు శాతం నాణ్యతతో పాటు పూర్తి స్పష్టత ఉండాలి





- కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత

**కొవ్వూరు, పెన్ పవర్, నవంబర్ 17:** పీజిఆర్ఎస్ వేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కారం అందించాల్సిన అవసరం ఉందని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన "పీజిఆర్ఎస్ – మీ కోసం" కార్యక్రమంలో వచ్చిన అర్జీలను స్వీకరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈరోజు మొత్తం 11 అర్జీలు పీజిఆర్ఎస్ ద్వారా అందాయని తెలిపారు. ప్రజలకు చేరువైన సుపరిపాలన కోసం ప్రభుత్వమిచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, ప్రతి శాఖాధికారి తమ శాఖకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సూచించారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యలను పరిష్కరించి తిరిగి అర్జీలు రావడానికి అవకాశం లేకుండా చూడటం అధికారులు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్సీ తహసీల్దార్ పి. అచ్యుత కుమారి, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సొంత నిధులతో పాఠశాల ఆవరణ అభివృద్ధికి రూ.35 వేల విరాళం

- కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణకు నూతన అందాలు





**ఏలూరు జిల్లా, ఉంగుటూరు పెన్ పవర్ :**ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ జీతాలు మాత్రమే పొందక, పాఠశాల అభివృద్ధిని తమ బాధ్యతగా భావించి ముందుకు రావడం సామాజిక సేవకు నిలువెత్తు నిదర్శనం అని తల్లిదండ్రులు పేర్కొన్నారు.


నాచుగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ లోటట్టుగా ఉండటంతో విద్యార్థులు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్రి వెంకటలక్ష్మి రూ. 20,000, ఉపాధ్యాయురాలు ఎస్. కళ్యాణి రూ. 15,000 మొత్తంగా రూ.35,000 విరాళంగా అందించి పాఠశాల ఆవరణ అభివృద్ధి పనులను స్వయంగా చేపట్టారు.

ఈ నిధులతో లోటట్టును శుభ్రపరిచి, ఎర్రమట్టి, నల్లరాతి మెటల్ తొలగించి మొక్కలు నాటేందుకు అనువుగా ఆధునికరణ పనులు పూర్తిచేశారు. విద్యార్థులకు సుందరమైన వాతావరణం చేయాలన్న తపనతో చేసిన ఈ పని గ్రామస్తులు, తల్లిదండ్రులు, అధికారులు ప్రశంసించారు.

గ్రామ ప్రజలు ఉపాధ్యాయుల సేవా భావం నిజంగా ఆదర్శప్రదమైందని అభినందించారు.

# అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న రేవు శ్రీను.





**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 17:** కే గంగవరం మండలం కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో ఆఖరి సోమవారం భక్తుల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) పాల్గొని స్వయంగా భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీ చాయ సోమేశ్వర స్వామివారిని టిడిపి సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు,గొడవర్తి రామకృష్ణ, కర్రి చిట్టిబాబు,వెంటూరి వీరరాఘవలచౌదరి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కే గంగవరం గ్రామంలో శ్రీ అన్నపూర్ణా సమితి విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా మండలంలో వివిధ గ్రామాల్లో కార్తీకమాస వన సమాధానం కార్యక్రమాలు నిర్వహించారు.

# వినాయకునికి వెండికిరీటం బహుకరణ



**అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 17:**మాచవరం గ్రామంలోవేంచేసియున్న శ్రీపార్వతీ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో కొలువుతీరిన శ్రీ వినాయక స్వామివారికి సోమవారం దాత వెండికిరిటం బహుకరించారు. ఆలయ అర్చకులు మాచరి సూరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి వెండికిరీటాన్ని స్వామివారికి అలంకరించారు. ముంజవరం గ్రామానికి చెందిన మట్టపర్తి కాశీవిశ్వనాథం కుటుంబం సుమారు రూ. 75 వేలు విలివైన వెండి కిరీటాన్ని స్వామివారికి బహుకరించారని ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొత్తూరి గున్నయ్య సిద్ధాంతిలు తెలిపారు.
ఆలయ ప్రాంగణంలో లక్ష పత్రి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# న్యాయవాదులకు రక్షణ చట్టం రూపొందించాలి

## సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా న్యాయవాదుల పోరాట కమిటీ ధర్నా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,నవంబర్ 17:** రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టం రూపొందించాలని, 41ఏ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా న్యాయవాదుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. తొలుత కోర్టు ప్రాంగణం వద్ద ఆందోళన చేపట్టిన న్యాయవాదులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధి పి.వి.వివిఎస్.బి. రాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేలకు పైగా న్యాయవాదులు వృత్తిని కొనసాగిస్తున్నారని, ఇటీవల పోలీసులు, నిందుతులు కచ్చిదారులు న్యాయవాదులపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలని కోరారు. ప్రస్తుతం ఏడు సంవత్సరాల లోపు పోలీసులు అమలు చేస్తున్న 41ఏ చట్టం వల్ల న్యాయవాదులు ఉపాధి కోల్పోతున్నారని, ఆ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాల్లోనే బెయిల్ పొందే అవకాశం కల్పించాలని కోరారు. న్యాయవాదులకు వారి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల రూపాయల ఉచిత ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే స్టై ఫండ్ ను ఐదువేల నుండి రూ.10,000 కు పెంచాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు న్యాయపరిజ్ఞానం కోసం లైబ్రరీ నిమిత్తం నిధులు మంజూరు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దూడల త్రినాధరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు,సాదిక్ హుస్సేన్ ,ఎస్ ప్రవీణ్ కుమార్, బడుగు రాజు, కొండేటి వరలక్ష్మి, రూపా రాజేశ్వరి, బీరా అరుణ్ కుమార్, నంద, జంగా రాజశేఖర్,బి వీరరాజు, దంగేటి మౌనిక,డి రాజా రత్నం, ఓట్ల శ్రీనివాస్, చందశి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు

## నేడు జిల్లా స్థాయి సీనియర్ జూడో సెలెక్షన్స్

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 17:** కాకినాడ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ జూడో సెలెక్షన్స్ ఈనెల 18వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు కాకినాడ డీఎస్సీ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి టీవీవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన జగ్గంపేటలో ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలో పాల్గొనేవారికి 15 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలని, ఆధార్ కార్డు, పదవ తరగతి మార్కులు లిస్ట్, జనన ధ్రువపత్రం జిరాక్స్ కాపీలతో నిర్దిష్ట సమయానికి హాజరు కావాలన్నారు.

## జగ్గంపేట అన్నా క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 17:** జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో దాతల సహకారంతో ప్రతి సోమవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉచిత అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈసోమవారం కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సమ్మిట వీర వెంకట సత్యనారాయణ (వీరబాబు) ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు హాజరై అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మంచికంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, దాపర్తి సీతారామయ్య, యల్లమిల్లి సీఎం, దేగల సత్తిబాబు, నండ్ల చిరంజీవి, బద్ది సురేష్, సాంబత్తుల చంద్రశేఖర్, ఎండి రాజా, మారిశెట్టి గంగ, ఎస్ వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హజరత్ వలి జల జలీషా దుర్గా ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు మొహమ్మద్ ఏ కె జిలానీ మృతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 17:** హజరత్ వలి జల జలిషా దుర్గా ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ (75 )ఆదివారం మృతి చెందారు. వీరికి భార్య,కుమార్తె,కుమారుడు ఖాదర్ మొహియుద్దీన్ కలరు.వీరి మరణ వార్త తెలియగానే దర్గా పూర్వధ్యక్షులు షేక్ అసదుల్లా అహమ్మద్,రాయల్ మాస్క్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ కరీం,యువ నాయకులు బాసిత్ ఖాన్, అర్షద్ ,దర్గా ట్రస్టీలు జలీల్, జాకీర్ వారి ఇంటికి వెళ్లి తీవ్ర సంతాపం తెలియజేసి వారి కుటుంబానికి సానుభూతి తెలియ జేశారు. సోమవారం అంత్యక్రియలు ఇమామ్ లు అన్సారీ, గులాం మొహియుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం బరియల్ గ్రౌండ్ లో జరిగాయి.ఆయేషా మాస్క్ అధ్యక్షులు సత్తార్, సెక్రటరీ సర్దార్,ఇలియాస్ జాని, అసిఫ్, బాషా, వలి బాషా మలన్, ఘన్నా, అమానుల, హబీబ్ సంతాపం తెలియజేశారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు.






**కె గంగవరం పెన్ పవర్ నవంబర్17 :**కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలో గల అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.కె గంగవరం మండలం కోటిపల్లి లో తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో గౌతమి గోదావరిలో పుణ్యస్నానమాచరించి శివునికి ప్రీతి కరమైన రోజు సోమవారం సందర్భంగా శ్రీ ఛాయా సోమేశ్వరస్వామినీ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని అమ్మవార్లను పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు.అదేవిధంగా కె గంగవరం మండలం అన్ని గ్రామాల్లో శివాలయంలో హరిహర నామాలతో శివాలయాలు మార్మోగాయి. కె గంగవరం మండలం పాతకోట గ్రామంలో శ్రీ లోపాముద్రంబ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండగండి గ్రామంలో సోమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన గంగవరం గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు.

## కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్



**అల్లవరం,పెన్ పవర్, నవంబర్ 17:** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు కంటి పరీక్షలు, ఈసీజీ, షుగరు బిపి టెస్టులు ఉచితంగా నిర్వహించరు డాక్టర్ సుశీల చే మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కిమ్స్ హాస్పటల్ వారి ద్వారా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు,ఎంపీటీసీ దొమ్మేటి శ్రీ శాంతి భవాని, పాలకవర్గ సభ్యులు చింత శ్రీను, బొంతు పల్లంరాజు,కారాడి నాగలక్ష్మి,జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు అడపా శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, సొసైటీ డైరెక్టర్ మొయిల గణపతిల గణపతి, అయిల నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పంచాయితీ కార్యదర్శి బి.అదిశంకరం,దొమ్మేటి రాధాకృష్ణ, ముత్యాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 16 అర్జీలు స్వీకరణ




అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 17:**అర్జీదారుల సంతృప్తిస్థాయి మెరుగుపర్చేలా సమస్యలు పరిష్కరించాలని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా మొత్తం 16 అర్జీలు నమోదయ్యాయన్నారు. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 3, రెవెన్యూకి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 7, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి ఒకటి, వార్డు సచివాలయాలకు సంబంధించి మూడు ఉన్నాయి. ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని అదనపు కమిషనర్ సూచించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత పెరగాలని, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలన్నారు. ఫిర్యాదుల ఆడిటింగ్ ను చేయాలని పేర్కొన్నారు. సోమవారం వచ్చిన అర్జీలు శనివారం నాటికల్లా పూర్తయ్యాలా ఆయా విభాగాల హెచ్ఓడీలు చొరవ చూపాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న, సంక్లిష్టమైన అర్జీలను వదిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఎంహెచ్ఓ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో ఉన్నవారికి అండగా జనసేన సేవాదళ్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 17:** కష్టకాలంలో ఉన్న వారికి తాము ఉన్నామంటూ అండగా జనసేన సేవాదళ్ పని చేస్తుందని వ్యవస్థాపక అధ్యక్షుడు సీరం శ్రీను అన్నారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన సిరిపురం గ్రామానికి చెందిన వజ్రంగి సింగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బతగిలి మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచి గ్రామానికి చెందిన సైనికుడు సీరం శ్రీను, జనసేన సేవాదళ్ సభ్యులు బాధితుడు కుటుంబానికి బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తాము చేపడుతున్న సహాయ కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందిస్తున్నారని, వీరితోపాటు జనసేన సేవా సభ్యులు అందిస్తున్న సహకారంతో ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమం కు సహాయ సహకారాలు అందించిన సేవాదళ్ సభ్యుల ఉదారతకు సింగరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అగ్ని ప్రమాదానికి గురైన కుటుంబాలకు ర్యాలి ఉపాధ్యాయుడి పరామర్శ



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్17:**మెర్లపాలెం నరసింహనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రెండు కుటుంబాల వారు ఆస్తి సంపూర్ణంగా కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఘటనపై విచారం వ్యక్తం చేసిన ర్యాలి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గూడపాటి మాణిక్యాలరావు దంపతులు బాధితులను ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు.అగ్నికి ఆహుతైన కుటుంబాలకు తమవంతు సహాయంగా రూ.5,000 నగదు అందజేసి, ధైర్యం చెప్పి వారికి ఆర్థికంగా, మానసికంగా తోడుగా నిలిచారు. మాణిక్యాలరావు చూపిన మానవత్వానికి, ఔదార్యానికి గ్రామస్థులు ప్రశంసలు కురిపించారు.బాధిత కుటుంబాలు అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇంకా ప్రభుత్వం దాతలు సహాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశాయి.

## తాళ్ళపూడి శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

**తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 17:**సోమవారం తాళ్ళపూడి శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నాలుగో రోజుగా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యక్రమ అధ్యక్షులుగా తాళ్ళపూడి పశువైద్యులు డాక్టర్ ఎన్.వరలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు కవులు, రచయితల గురించి తెలియజేశారు. వారి సాహిత్యాన్ని గురించి వర్ణించారు. తాళ్ళపూడి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ సిహెచ్.ఆంజనేయులు గ్రంధాలయం యొక్క ప్రాముఖ్యతను గురించి సందేశాన్ని ఇచ్చారు. అదేవిధంగా తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్.ఎం శాస్త్రి తెలుగు కవులలో గొప్పవారైన శ్రీరంగ శ్రీనివాసరావు(శ్రీశ్రీ) గురించి వివరించారు.



అనంతరం గ్రంధాలయ అధికారి మంగళవారం జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. సోమవారం కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ



కార్యక్రమాన్ని గ్రంధాలయ అధికారి ఏ.నరేష్ వందన సమర్పణతో ముగించడం జరిగింది.

# వానపల్లిలో డెంగ్యూ అప్రమత్తం - మలేరియా అధికారి పరిశీలన.







**కొత్తపేట,పెన్ పవర్,నవంబరు17:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో ఉన్న వానపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వానపల్లి గ్రామం రంగా సెంటర్‌లో డెంగ్యూ అనుమానిత కేసు నమోదు కావడంతో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు గురువారం ఆ ఇంటిని సందర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమల అభివృద్ధికి దారితీసే నీటి నిల్వలు, మురికికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు, అబేట్ స్ప్రేయింగ్ వంటి దోమల నిర్మూలన చర్యలను గ్రామ సెక్రటరీతో ఆరాతీసి ఆ పని క్రమాన్ని పరిశీలించారు.అధికారి మాట్లాడుతూఇంటి ఇంటికీ సర్వే చేసి, నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరం అని తెలిపారు."ప్రజలు ఫ్రైడే డ్రై డేను కట్టుదిట్టంగా పాటిస్తే దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చు. దోమ కాటుతో వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటి అనేక అంటువ్యాధులను నివారించవచ్చు" అని పేర్కొన్నారు. పారిశుద్ధ్యాన్ని శాశ్వత అలవాటుగా మార్చుకుని, ఇళ్ల చుట్టుపక్కల చెత్త, నీటి నిల్వలు, గుంతలను తొలగించడం గ్రామ ఆరోగ్య భద్రతకు కీలకమని సూచించారు.తరువాత బిళ్లకుర్రు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించి సిబ్బంది పని తీరు, జ్వరం కేసుల పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో దోమల నిర్మూలన చర్యలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.రాజబాబు,ఎమ్.పిహెచ్.ఎస్. వి. రాధాకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు బి. శ్రీనివాసరావు, ఐ. శ్రీనివాసరావు,ఎమ్.ఎల్.హెచ్.పి లు,ఏ.ఎన్.యమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కె.పెదపూడి అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

* వస్త్రాలు, వస్తువులు వితరణ




**అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 17:**అంబాజీపేట మండలంలోని కె.పెదపూడి గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో రెండు ఇల్లు అగ్నికి ఆహుతి కాగా, నాలుగు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఈ నాలుగు కుటుంబాలకు సహాయంగా తొండవరం మాజీ ఎంపిటిసి, స్వయంకృషి అవార్డు గ్రహీత కీర్తిశేషులు చిట్టూరి కృష్ణమూర్తి మనవడు విజయ్ కుమార్, దుర్గ దంపతులు సుమారు 16 వేల రూపాయలు విలువ చేసే వస్త్రాలు, దుప్పట్లు, రగ్గులతో పాటుగా వంట సామాగ్రిని అందించారు. వీరిని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## వనసమారాధనలు ప్రజల్లో సంఘీభావానికి ప్రతీక.



**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 17:** వన సమారాధనలు ప్రజల్లో సంఘీభావానికి ప్రతీక అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. మండల పరిధిలోని లింగంపర్తి గ్రామ శివారు మాజీ ఎంపీటీసీ జి. రాఘవ పొలంలో వన సమారాధన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత పొలంలో ఉసిరి చెట్టుకు సాంప్రదాయం బద్ధంగా పూజలు నిర్వహించి, వన సమారాధన కార్యక్రమం లో పాల్గొని సాహపక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనేకుల వీరభద్ర రావు,పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట కృష్ణ, పెంటకోట నాయుడు (నాని), గెడ్డం నూకాపతీ రావు ,కాళ్ల త్రిమూర్తులు, వడ్డీ నాగ దుర్గ, కీలు లక్ష్మణరావు ,బోను రాంబాబు , బంధువులు, స్నేహితులు ,ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా మహా శివునికి లక్ష పత్రిపూజ



**అంబాజీపేట: పెన్ పవర్ నవంబర్ 17:**కార్తీక మాసం సందర్భంగా శివాలయాలు శివనామ స్మరణతోఅరు మ్రోగాయి. వేకువజాము నుండి అలయాలో భక్తులు పరమశివుని కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాచవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ మల్లేశ్వరస్వామి స్వామి వారి ఆలయం నందు స్వామివారికి లక్ష పత్రి పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలి..




**అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 17:** అంబాజీపేట,ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు వి.గౌతమీ,కె. ఎన్. శ్రీనివాస్, కె.సుమప్రియల ఆధ్వర్యంలో సోమవారం లెప్రసీ నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని పీహెచ్సీల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు.

వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు ప్రతీ ఇంటిని సర్వే చేయనున్నామన్నారు. ఈ సర్వేలో లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. రోగులకు ఆరు నెలల నుండి 12 నెలల కాలం ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అనంతరం ప్రధాన రహదారులపై అవగాహన ర్యాలీని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బి. అప్పారావు, ఎంపిహెచ్ఎస్ లు ఎ. రాధా నరసింహం, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేరవరం లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 17:** మండల పరిధి పేరవరం గ్రామంలో ఆర్ బి సి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. లింగంపర్తి సొసైటీ డైరెక్టర్ వేమగిరి ధర్మరత్నం ఆర్బిసి సెంటర్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని ఆర్బీసీ సెంటర్కు తరలించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించిన ప్రభుత్వం అన్ని విధాల రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోరాదని, రైతులు అధికారులకు అన్ని విధాల సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కర్రి సూర్యప్రకాశరావు, టిడిపి రథసారథి అవసరాలు సూర్య ప్రకాష్ రావు , దేగల సత్యనారాయణ, జనసేన నాయకుడు ఏలూరు రాంబాబు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్, రైతులు పాల్గొన్నారు.

## పాడి పశువుల్లో పొదుగు వాపు వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు -కొవ్వలి వెటర్నరీ సర్జన్ హరికృష్ణ





**ఏలూరు నవంబర్ 17 పెన్ పవర్:** పాడి పశువులకు సంక్రమించే వ్యాధులలో పొదుగు వాపు వ్యాధిని నివారించేందుకు పాడి రైతులు పశు వైద్య నిపుణులు సలహాలు, సూచనలు పాటిస్తే పాడి పశువుల్లో పొదుగు వాపు వ్యాధిని నివారించవచ్చని దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలం కొవ్వలి పశు వైద్య నిపుణులు వైద్య నిపుణులు డాక్టర్. హరికృష్ణ పాడి రైతులకు సూచించారు. సోమవారం పాడి రైతు తీసుకోవచ్చున పొదుగు వాపు వ్యాధితో ఉన్న పాడి గేదెను పరీక్ష చేసి వైద్యం అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ పాడి రైతులతో మాట్లాడుతూ పాడి పశువులు ఈనిన తరువాత పాడిపశువులకు పొదుగు వాపు వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఆ సమయంలో పొదుగులో ఉన్న పాలు బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ కారణంగా గట్టిపడిపోతాయని అప్పుడు ఎంత పిండినా పొదుగునుండి పాలు రావని,బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ తొలగించడానికి యాంటీ బయోటిక్ యాంటీ ఇన్ఫ్లమేషన్ యాంటీ ఇన్సూరెన్స్ ఇన్సూరెన్స్ మందులను వరుసగా మూడు రోజులు పాటు పశువులకు ఇచ్చి, దానికి సంబంధించిన ఆయింట్మెంట్ పొదుగుకు పూయాలని,ఈ ఇంజక్షన్ వల్ల బ్యాక్టీరియా పాడి పశువుల్లో ఉన్న బ్యాక్టీరియా తగ్గి పేడ రూపంలో బయటకు వచ్చేస్తుందని రైతులకు సూచించారు.

## పల్లపువీధి రైతులకు ఊరట: భీమకర్ర కాలువ రోడ్డు పూర్తి



**కరప, పెన్ పవర్, నవంబర్ 17:** మండల కేంద్రం కరప గ్రామానికి చెందిన రైతులకు, ప్రజలకు అత్యంత ముఖ్యమైన కరప పల్లపువీధి శివారు భీమకర్ర కాలువ వరకు గల గ్రావెల రోడ్డు పూర్తి కావడంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. చాలా కాలంగా అస్తవ్యస్థంగా, బురదమయంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయించడానికి స్థానిక నాయకులు, రైతులు చేసిన విజ్ఞప్తుల మేరకు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తక్షణమే స్పందించారు. ?ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించిన గ్రామ రైతులు నూకల సూరిబాబు, పుణ్యమంతుల సత్యనారాయణ, జనసేన నాయకులు చిన్నారి శ్రీనివాస్ తదితరులు సమస్యను జనసేన సీనియర్ నాయకులు యాళ్ల వీరవెంకట సత్యనారాయణ (పండు) దృష్టికి తీసుకెళ్లారు. పండు వెంటనే ఈ విషయాన్ని ఎమ్మెల్యే నానాజీకి వివరించగా, ఆయన ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి రూ. 5.5 లక్షల నిధులను మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, రోడ్డు పనులు శరవేగంగా పూర్తి అయ్యాయి. ముఖ్యంగా పల్లపు వీధిలో ఎర్రంనీడి వెంకటరమణ పొలం నుండి పుణ్యమంతుల గంటయ్య పొలం వరకు అత్యవసరంగా ఉన్న రోడ్డు భాగాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఈ కృషికి సహకరించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి, కూటమి నాయకులకు యాళ్ల వీరవెంకట సత్యనారాయణ తన తరపున, రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కొత్త రోడ్డుతో రైతులు తమ పంట ఉత్పత్తులను పొలాల నుంచి మార్కెట్‌కు తరలించేందుకు ఇకపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభంగా రాకపోకలు సాగించవచ్చని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## దగ్గుబాటి పురందేశ్వరిని ఎంపీగా గెలిపించడం దౌర్భాగ్యం

- నియోజవర్గానికి పరిశ్రమ తేలేకపోయారు.
- డిసిసి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర్ రెడ్డి విమర్శ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 17:**విశాఖపట్నం కేంద్రంగా ఈనెల 14, 15 తేదీల్లో పెట్టు బడులు వచ్చేలా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించడం శుభ పరిణామని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ రూ.13 లక్షల కోట్ల విలువైన 613 కంపెనీలు, పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల స్థాపనకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. అయితే రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుబాటి పురందరేశ్వరిని గెలిపించుకోవడం నియోజవర్గ ప్రజలకు నిష్ప్రయోజనం కలిగిస్తుందని విమర్శించారు. ఆమె స్వయాన సీఎం చంద్రబాబుకు, ఐటీ మంత్రి నారా లోకేష్ కు బంధువే అయినప్పటికీ ఎటువంటి ప్రయోజనాలు సాధించలేక పోతున్నారని విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నప్పటికీ రాజమండ్రి నియోజకవర్గానికి ఎలాంటి పెట్టుబడులు, పరిశ్రమలు తేలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నిరంతరం గోదావరి నీరు, ఎయిర్ పోర్ట్ , రైల్వే స్టేషన్, సమీపంలో కాకినాడ పోర్టు, మెట్ట ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ పరిశ్రమల స్థాపనకు, యువతకు ఉపాధి కల్పించడానికి ఇంతవరకు ముందడుగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.70 సంవత్సరాల క్రితం స్థాపించిన ఏపీ పేపర్ మిల్లు తప్ప ఇక్కడ ఒక పెద్ద పరిశ్రమ కూడా లేదని వ్యాఖ్యానించారు. మిల్లు నుంచి కాలుష్యం ఎదురవు తున్నప్పటికీ ప్రజలు భరిస్తున్నారని తెలిపారు. భారీ స్థాయిలో విశాఖలో సీఐ సదస్సు జరిగినప్పటికీ రాజమండ్రి నియోజకవర్గానికి సంబంధించి ఒక్క పరిశ్రమ స్థాపనకు కూడా ఎంఓయూ జరగకపోవడం దారుణమన్నారు. నియోజక వర్గంలోని కూటమి నాయకులు ఇసుక ర్యాంపులు, గ్రావెల్, మట్టి తరలింపు, సెటిల్మెంట్ లతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. తాజాగా ఏవి అప్పారావు రోడ్డులో 234 గజాల రెండు కోట్ల విలువైన స్థలాన్ని వైసిపి, టిడిపి, బిజెపి మహిళా నాయకురాలితో కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. ఈ వస్తాయి మంచి సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బత్తిన చంద్ర రావు, డాక్టర్ రాజశేఖర్, బర్రె సుబ్రహ్మణ్యం, కిషోర్ కుమార్ జైన్, దేయ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డిపో అధికారి సూర్యచంద్రరావు కు సత్కారం



**అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 17**:కోనసీమలో కొలువుతీరిన ఏకాదశ రుద్రులను భక్తులు దర్శించుకొనేందుకు ఆర్టీసి బస్ లను ఏర్పాటు చేయటలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మొట్టమొదటసారిగా "ఏకాదశరుద్రుల యాత్ర"కు రూపకల్పన చేసిన అధికారిని సోమవారం సత్కరించారు.

గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న ఏకాదశ రుద్రులలో 9వ రుద్రుడు సర్వేశ్వరరుద్రుడు శ్రీ ఉమా పార్వతీ వీరేశ్వరస్వామి, శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల దేవస్థానములో కొవ్వూరు డిపో అధికారి సూర్యచంద్రరావును శివకేశవ యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో సత్కరించారు.

ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ కోనసీమలో కొలువుతీరిన ఏకాదశ రుద్రలను దర్శించుకొనేందుకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందిని అవకాశం నాకుదక్కటం అదృష్టం గా భావిస్తున్నాని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నీరుకొండ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 17:** ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీరుకొండ సత్యనారాయణ పార్టీ పదవికి సోమవారం రాజీనామా చేశారు. గత 2024 సార్వత్రికి ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి చవి చూసారు. అనంతరం ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ కొనసాగుతున్న సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీకి, పదవికి రాజీనామా చేయడం కాంగ్రెస్ శ్రేణులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సందర్భంగా సత్యనారాయణ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకం ఉంచి గత ఎన్నికలలో పోటీ చేసే విధంగా ప్రోత్సహించిన నందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని, నా వ్యక్తిగత కారణాల రీత్యా పార్టీ నుండి తప్పుకుంటున్నానని, ప్రజలకు మరింత సేవ చేయాలని ఉన్నా ,ప్రస్తుత పరిస్థితులు అందుకు అనుగుణంగా లేవని అందువల్ల కాంగ్రెస్ పార్టీ నుండి తప్పుకుంటున్నానని ప్రకటించారు. తదుపరి భవిష్యత్ కార్యాచరణ కార్యకర్తలు, హితులు, సన్నిహితులు,శ్రేయోభిలాషులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని నీరుకొండ సత్యనారాయణ మీడియాకు తెలిపారు.

# అడ్డతీగల సోమలమ్మ తల్లి గుడి వద్ద కార్తీక మాస దీపోత్సవం...





**అడ్డతీగల, పెన్ పవర్, నవంబర్ 17:** కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆఖరి సోమవారం కావడంతో బాలవిజ్ఞాన యూత్ ఆధ్వర్యంలో అడ్డతీగల సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద 1000 దీపోత్సవం నిర్వహించారు. గత 10 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వహకులు కుప్పల.హనుమంతు, జయరాం కుటుంబ సభ్యులు తెలిపారు. అడ్డతీగల గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చి దీపాలంకరణ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతోపెద్దలు, పిల్లలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కన్నుల వైకుంఠంగా జరిగింది. విపరీతమైన చలి వేస్తున్న, మంచు కురుస్తున్న ఏ ఒక్కరు లెక్కచేయకుండా ఈ దీపోత్సవం కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొన్నారు.

## పూతిగుంట శివాలయం వద్ద కార్తిక వన భోజనాలు





**వై రామవరం, పెన్ పవర్,నవంబర్ 17 :** మండలంలోని పూతి గుంట శివాలయం దగ్గర కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఘనంగా వన భోజనాలు నిర్వహించారు.

మండలంలోని చవిటి దిబ్బలు పంచాయితీ పూతి గుంట గ్రామ వద్ద వేంచేసి ఉన్న శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో సోమవారం కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రత్యేకించి ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. శివాలయం పక్కనే ఉన్న సెలయేటిలో స్నానమాచరించి, ప్రత్యేక పూజలు అనంతరం ఆ ప్రాంతంలోనే మన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ వన భోజనాల కార్యక్రమానికి పలువురు భక్తులు విచ్చేసి మన బోజనాలను స్వీకరించారు.

## కార్తీక మాసం సందర్భంగా శివనామస్మరణతో దద్దరిల్లిన శైవక్షేత్రాలు...





**అడ్డతీగల, పెన్ పవర్,నవంబర్ 17:** అడ్డతీగల మండలంలో కార్తీకమాసం మహిమాన్వితత మరోసారి స్పష్టంగా కనబడింది. నవంబర్ 17 సోమవారం ఉదయం నుంచే శివాలయాల వద్ద భక్తజన సందడి ఉరుములా అలుముకుంది. కార్తీకమాసంలోని ఆఖరివారంఅలాగే ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని అడ్డతీగలలోని ఉబ్బ లింగేశ్వర స్వామి ఆలయం, నాగలింగేశ్వర స్వామి గుడి, ఉప్పలపాడు శివాలయం, పైడిపుట్ట,జడేరు శివాలయం తో సహా అన్నిప్రాంతంలోని అన్ని శైవక్షేత్రాలు "హర హర శంభో%శా% శంకరా!" అనే నినాదాలతో మారుమ్రోగాయి.

ప్రతీ ఆలయం వద్ద ఉదయం నుంచి రాత్రివేళల వరకు భక్తుల తాకిడి తగ్గలేదు. కుటుంబాలతో, పిల్లలతో, వృద్ధులతో సహా ప్రతి వర్గానికి చెందిన ప్రజలు కార్తీక సోమవారాన్ని భక్తుల శ్రద్దలతో జరుపుకున్నారు. పంచామృతాభిషేకాలు, రుద్రపారాయణాలు, దీపారాధనలు నిర్వహించగా, స్వామి దర్శనానికి గంటల తరబడి క్యూ లైన్లలో నిలిచిన భక్తులభక్తిభావంప్రత్యేకంగాఆకట్టుకుంది.శివాలయాలన్నీ భక్తులతో నిండిపోవడంతో, ప్రాంతీయంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా శివ నామస్మరణ తో శైవక్షేత్రాలు దద్దరిల్లాయి , దీపాల వెలుగు, ధూపదివ్వెల పరిమళం, వేణువుల శబ్దం ప్రాంతమంతా ఓ పుణ్యక్షేత్రంగా మారిపోయింది. అనేక గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనలు ఏర్పాటు చేయగా, సేవా కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివభక్తులలోని ఆధ్యాత్మిక తపన బయటపడింది. ధార్మిక సంప్రదాయాలు, ప్రజల విశ్వాసాలు, సమూహ ఆరాధన అన్ని కలసి ప్రాంత ప్రజల ఐక్యతను, సంస్కృతిని మరింత వెలుగులోకి తెచ్చాయి. అలసట తెలిసీ తెలియని భక్తి సందడి మధ్య అడ్డతీగల మండల శివాలయాలు సోమవారం భక్తితో నిండిన పుణ్యక్షేత్రాల్లా వికసించాయి.

# సిరిపురం గ్రామసభలో 'స్వామిత్వ' పై ఎంపీడీవో కీలక దిశానిర్దేశం!




**కరప, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** మండలంలో గ్రామ స్వరాజ్య స్థాపన, పౌర సేవలను మరింత బలోపేతం చేసే దిశగా కరప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జె. శ్రీనివాస్ కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా, సిరిపురం గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన 'స్వామిత్వ' ప్రత్యేక గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, గ్రామీణ ప్రజలకు ఈ కీలక పథకంపై సమగ్ర అవగాహన కల్పించడమే కాక, సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ?భూ యాజమాన్య హక్కులను సుస్పష్టం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల విలువ పెంచేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన 'స్వామిత్వ' (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) అమలు తీరును ఆయన ప్రత్యేకంగా పర్యవేక్షించారు. గ్రామంలో ఆస్తి హక్కులకు సంబంధించిన గందరగోళాన్ని తొలగించి, పారదర్శకత పెంచడంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యతను ఎంపీడీవో జె. శ్రీనివాస్ వివరించారు. డ్రోన్ సర్వే ద్వారా ఆస్తి కార్డులను పంపిణీ చేయడం వలన గ్రామీణ ప్రజలకు బ్యాంక్ రుణాలు పొందడం, ఆస్తులను అమ్మడం/కొనడం వంటి లావాదేవీలలో ఎదురయ్యే సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, గౌరవ డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు కూడా పాల్గొని, సాంకేతిక అంశాలపై వివరణ ఇచ్చారు. తమ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సరిచూసుకునే ప్రక్రియలో అధికారులు, సచివాలయ సిబ్బంది వారికి పూర్తి సహకారం అందించాలని, ఈ పథకాన్ని నిర్ణీత కాలంలో వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో జె. శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నున్న సుజాత వీర వెంకట సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి దుర్గ భవాని, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వీరుల సంబరాల్లో పాల్గొన్న వీరబాబు గౌడ





**కొత్త పేట పెన్ పవర్ నవంబర్ 17**:కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన వీరుల సంబరాలు ఘనంగా, అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచే ఈ వేడుకలకు రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు గౌడ పాల్గొన్నారు

ఉదయం తెల్లవారకముందే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ మహిళలు, పెద్దలు, యువత కలిసి తలస్థానాలను శుభ్రపరచి, మండపాలను అలంకరించారు. వేకువ జామునుండే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వాటి వద్ద సంప్రదాయ పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. గౌడ సంప్రదాయానికి ప్రతీకలుగా భావించే వీరుల తలస్థానాల వద్ద భక్తిశ్రద్ధలతో అర్చనలు, దీపారాధనలు నిర్వహించారు.అనంతరం ఆయన స్థానిక పెద్దలతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన విశేష పూజలో ఆయన వీరులకు నీరాజనం సమర్పించి, సమాజం కోసం వీరులు చేసిన సేవలను స్మరించుకోవడం తమకు గౌరవకారణమని పేర్కొన్నారు.

ఆయన మాట్లాడుతూ "వీరుల సంబరాలు మన గౌడ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక. సంప్రదాయాలను కాపాడటం, యువతకు పరిచయం చేయడం అత్యంత అవసరం. ఇలాంటి కార్యక్రమాలు సమాజ బాంధవ్యాన్ని మరింత బలపరుస్తాయి"ి అన్నారు.

కార్యక్రమం మొత్తం గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొనడం విశేషం. గ్రామ పెద్దలు, గౌడ సంఘ నాయకులు, మహిళా మండళ్ల ప్రతినిధులు కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ భక్తులకు అన్నప్రసాదం కూడా అందించారు.

వీరుల తలస్థానాల వద్ద సాగిన ప్రత్యేక పూజలు, సంప్రదాయ పతాక ప్రదక్షిణ, మంగళ వాయిద్యాల ధ్వనులతో మందపల్లి గ్రామం ఉత్సవస్ఫూర్తితో నిండిపోయింది. కార్యక్రమం సాయంత్రం వరకు సందడిగా కొనసాగింది.

## రాయల్స్ జట్టుకు లంక దిగ్గజం డ్యూయల్ రోల్.. హెడ్ కోచ్‌తో పాటు డైరెక్టర్‌గా బాధ్యతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ గా శ్రీలంక దిగ్గజ క్రికెటర్ కుమార్ సంగక్కర తిరిగి బాధ్యతలు చేపట్టనున్నాడు. సంగక్కరకు హెడ్ కోచ్ పాటు క్రికెట్ డైరెక్టర్‌గా బాధ్యతలు కూడా రాజస్థాన్ ఫ్రాంచైజీ అప్పగించింది. దీంతో ఐపీఎల్ 2026లో రాజస్థాన్ జట్టుకు ఈ లంక దిగ్గజం ద్విపాత్రాభినయం చేయనున్నాడు. గత సీజన్‌లో బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న విక్రమ్ రాథోర్ కు అసిస్టెంట్ కోచ్‌గా ప్రమోషన్ లభించింది. 2025లో రాజస్థాన్ జట్టు నుంచి విడిపోయిన ద్రవిడ్ స్థానంలో సంగక్కర ఈ బాధ్యతలను స్వీకరిస్తాడు. ద్రవిడ్ కూడా గత సీజన్ లో రెండు హెడ్ కోచ్ తో పాటు క్రికెట్ డైరెక్టర్ గా పని చేశాడు. “కుమార్ ప్రధాన కోచ్‌గా తిరిగి రావడం మాకు చాలా సంతోషంగా ఉంది. జట్టుకు ఏమి అవసరమో మేము పరిశీలించినప్పుడు, సంగక్కరతో పరిచయం.. అతని నాయకత్వం.. రాయల్స్ జట్టుపై అతనికి ఉన్న అతని లోతైన అవగాహన జట్టుకు సమతుల్యతను తీసుకొస్తుందని భావించాము. ఒక నాయకుడిగా కుమార్ పై ఎప్పటికీ మాకు పూర్తి నమ్మకం ఉంటుంది. అతని క్లారిటీ, ప్రశాంతత, క్రికెట్ తెలివితేటలు జట్టును ముందుకు నడిపించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి”. అని రాజస్థాన్ ఫ్రాంచైజ్ ప్రధాన యజమాని మనోజ్ బదాలే సోమవారం (నవంబర్ 16) అన్నారు. సంగక్కర గతంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో కలిసి పని చేశాడు. 2021 నుండి 2024 వరకు జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. సంగక్కర జట్టుతో ఉన్నప్పుడు రాజస్థాన్ వన్ ఆఫ్ ది టాప్ జట్టుగా దూసుకెళ్లింది. 2022 ఐపీఎల్ సీజన్ లో రాజస్థాన్ జట్టు ఫైనల్ కు చేరుకుంది. 2024 లో ప్లే ఆప్స్ కు అర్హత సాధించింది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ సంజు శాంసన్ ను ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు ఇచ్చేసింది. శాంసన్ స్థానంలో రాయల్స్ జట్టులో జడేజా, సామ్ కరణ్ చేరారు. రాథోర్ అసిస్టెంట్ కోచ్ తో పాటు, షేన్ బాండ్ బౌలింగ్ కోచ్‌గా కొనసాగుతారని ఫ్రాంచైజీ ప్రకటించింది. ట్రెవర్ పెన్నీ, సిడ్ లాహిరి వరుసగా అసిస్టెంట్ కోచ్, పెర్ఫార్మెన్స్ కోచ్‌గా కొనసాగుతారని చెప్పుకొచ్చింది.

**రాజస్థాన్ రాయల్స్ (**

**రిటైన్:**

యశస్వి జైస్వాల్, షిమ్రోన్ హెట్మెయర్, వైభవ్ సూర్యవంశీ, లుహాన్ డ్రే ప్రిటోరియస్, శుభమ్ దూబే, డోనోవన్ ఫెరీరా (DC నుండి), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా (CSK నుండి), సామ్ కుర్రాన్, రియాన్ పరాగ్, జోఫ్రా ఆర్చర్, టుడ్రే దేర్వాన్, సందీప్ దేర్వాన్ శర్మ, మఫాకా, యుధ్వీర్ సింగ్

**రిలీజ్:**

కునాల్ రాథోడ్, నితీష్ రాణా (డీసీకి), సంజు శాంసన్ (CSKకి), వనిందు హసరంగా, మహేశ్ తీక్షణ, ఫజల్‌హాక్ ఫరూఖీ, అశోక్ శర్మ, కుమార్ కార్తికేయ, ఆకాష్ మధ్వల్

## 20 ఓవర్లు.. 27 పరుగులు.. 8 వికెట్లు: సర్వీసెస్ స్పిన్నర్ అమిత్ శుక్లా సంచలన బౌలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** రంజీ ట్రోఫీలో అద్భుత గణాంకాలు చోటు చేసుకున్నాయి. సర్వీసెస్ స్పిన్నర్ అమిత్ శుక్లా సంచలన బౌలింగ్ తో హర్యానా బ్యాటర్లకు పీడకలగా మారాడు. ఏకంగా 8 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. లాహ్లిలోని చౌదరి బన్సీ లాల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం (నవంబర్ 16) తొలి రోజు ఆటలో భాగంగా 5 వికెట్లు పడగొట్టిన అమిత్ శుక్లా.. సోమవారం (నవంబర్ 17) మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఓవరాల్ గా 8 వికెట్లు తీసుకొని హర్యానా జట్టును తొలి ఇన్నింగ్స్ లో కేవలం 111 పరుగులకే కుప్పకూలేలా చేశాడు. ఓవరాల్ గా తొలి ఇన్నింగ్స్ లో 20 ఓవర్లు బౌలింగ్ చేసిన శుక్లా.. 8 మెయిడిన్ ఓవర్లతో 27 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. శుక్లా స్పిన్ ధాటికి హర్యానా వద్ద సమాధానమే లేకుండా పోయింది. యువరాజ్ సింగ్, మయాంక్ శాండిల్య, అంకిత్ కుమార్, యశ్వర్ధన్ దలాల్, ధీరు సింగ్, నిఖిల్ కశ్యప్ లను తొలి రోజు ఔట్ చేయడంతో 20 పరుగులకే హర్యానా సగం జట్టును కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రెండో రోజు ఆటలో భాగంగా కెప్టెన్ పార్థ్ వాట్స్, కపిల్ హుడా, కంబోజ్ వికెట్లను తీసుకున్నాడు. హర్యానా బౌలర్లకు చుక్కలు చూపించిన ఈ యువ బౌలర్ కెరీర్ లో బెస్ట్ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. మహారాష్ట్రతో జరిగిన గత సీజన్ రంజీలో 65 పరుగులకు ఏడు వికెట్లు తీసుకున్న శుక్లా తన బెస్ట్ బౌలింగ్ స్టాట్స్ ను అధిగమించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ తొలి ఇన్నింగ్స్ లో 205 పరుగులకు ఆలౌట్ అయింది. నకుల్ 41 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఆ అనంతరం శుక్లా బౌలింగ్ తో హర్యానా తొలి ఇన్నింగ్స్ లో 111 పరుగులకే ఆలౌట్ అయింది. శుక్లా 8 వికెట్లు తీసుకొని హర్యానాకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. అంకిత్ కుమార్ 32 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న హర్యానా 4 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసి 195 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

## నాలుగో స్థానానికి పడిపోయిన టీమిండియా.. WTC లేటెస్ట్ పాయింట్స్ టేబుల్ ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 లో భాగంగా లేటెస్ట్ పాయింట్స్ టేబుల్ లో ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓటమి తర్వాత మూడో స్థానంలో ఉన్న టీమిండియా (54.17) ఒక స్థానం దిగజారి నాలుగో ర్యాంక్ తో సరిపెట్టుకుంది. మరోవైపు సౌతాఫ్రికా రెండో స్థానానికి ఎగబాకింది. తొలి టెస్టుకు ముందు నాలుగో స్థానంలో ఉన్న సఫారీలు టీమిండియాపై విజయంతో 66.67 పాయింట్ల శాతంతో టాప్-2కు దూసుకెళ్లారు. ఒకవేళ ఇండియా చివరి టెస్టులో కూడా ఓడిపోతే పాకిస్థాన్ కంటే కిందకు వచ్చి ఐదో ర్యాంక్ లో ఉంటుంది.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ లో భాగంగా ఇంగ్లాండ్ తో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-2 తో సమం చేసుకొని మూడో స్థానంలో నిలిచిన టీమిండియా.. ఆ తర్వాత వెస్టిండీస్ పై రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-0తో క్లీన్ స్వీప్ చేసి మూడో స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. విండీస్ పై రెండో టెస్టులో విజయం తర్వాత పాయింట్ల శాతం (%భాజు%) 55.56 నుండి 61.90కి పెరిగింది. పాయింట్ల శాతాన్ని పెంచుకోగలిగినప్పటికీ టాప్-2 లోకి రాలేకపోయింది. అయితే సౌతాఫ్రికాపై తొలి టెస్ట్ ఓటమితో నాలుగో ర్యాంక్ కు పడిపోయింది. గౌహతి వేదికగా జరగనున్న రెండో టెస్టులో విజయం సాధిస్తే సౌతాఫ్రికా నాలుగు.. ఇండియా మూడో స్థానానికి వస్తుంది. వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా జూలై నెలలో మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 3-0 తేడాతో విజయం సాధించిన తర్వాత అగ్రస్థానంలో కొనసాగుతుంది. సౌతాఫ్రికా, శ్రీలంక వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఇండియా నాలుగో స్థానంలో కొనసాగుతోంది. పాకిస్థాన్ ఐదు, ఇంగ్లాండ్ ఆరు, బంగ్లాదేశ్ ఏడో స్థానంలో నిలిచాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో 5 టెస్టు మ్యాచ్ లాడిన విండీస్ జట్టు ఐదు మ్యాచ్ ల్లోనూ ఘోరంగా ఓడిపోయింది. ఇండియా ఇప్పటివరకు డబ్ల్యూటీసిలో 8 టెస్ట్ మ్యాచ్ లాడింది. వీటిలో నాలుగు గెలిచి మూడు మ్యాచ్ ల్లో ఓడిపోయింది. ఓవరాల్ గా 54.17 పాయింట్లతో నాలుగో స్థానంలో స్థానంలో ఉంది.

వారణాసిలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో ప్రియాంక చోప్రా ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టింది



## అక్కడ రామాయణ.. ఇక్కడ వారణాసి.. ఏం జరుగుతుందో?



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు మైథలాజికల్ జోనర్ లో సినిమాలు రూపొందుతుంటాయి. ఇప్పటికే వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పుడు మరిన్ని చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆయా మూవీల షూటింగ్స్ శరవేగంగా జరుగుతుండగా.. వచ్చే ఏడాది థియేటర్స్ లోకి వచ్చి సందడి చేయనున్నాయి.ఆ సినిమాల్లో రెండు రామాయణ, వారణాసి. ఇతిహాసం రామాయణం ఆధారంగా ప్రతిష్టాత్మకంగా రామాయణ మూవీ నార్త్ లో రూపొందుతోంది. రెండు భాగాల్లో రిలీజ్ కానుంది. అదే సమయంలో సౌత్ లో వారణాసి సినిమా తెరకెక్కుతోంది. ఆ మూవీలో మైథాలజీతోపాటు టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్స్ టచెస్ కూడా ఉన్నాయని వినికిడి.ఏదేమైనా రామాయణ, వారణాసి.. రెండు భారీ బడ్జెట్ తో రూపొందుతున్న చిత్రాలే.. పాన్ ఇండియా సినిమాలే.. ఇప్పుడు రెండూ షూటింగ్స్ ను జరుపుకుంటున్నాయి. అయితే రెండింటిపై కూడా ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా రిలీజ్ అయిన గ్లింప్సెస్ తో సినీ ప్రియులు, అభిమానులు హోప్స్ పెట్టుకున్నారు.అదే సమయంలో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. రెండు సినిమాలు రిలీజ్ అయ్యాక కంపేరిజన్లు ఉంటాయని అనేక మంది నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే రామాయణంలోని కొంత అంశాన్ని మన రాజమౌళి వారణాసి మూవీకి గాను తీసుకున్నట్లు ఇప్పటికే గ్లింప్స్ అండ్ రాజమౌళి కామెంట్స్ ద్వారా క్లారిటీ వచ్చేసింది.దీంతో పోలికలు వస్తాయని, ఇది మేకర్స్ కు సవాల్ లాంటిదని అభిప్రాయపడుతున్నారు. అయితే రామాయణ, వారణాసి డైరెక్టర్లు నితీష్ తివారీ, రాజమౌళి.. ఇద్దరూ మంచి టాలెంట్ ఉన్న దర్శకులే. రామాయణ మూవీతో విజువల్ వండర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఆడియన్స్ కు మంచి ఎక్సపీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజమౌళి గురించి అందరికీ తెలిసిందే. ఒక్క పద్దతి.. ఒక ప్లానింగ్.. ఒక విజన్ అనే స్టేట్మెంట్ కరెక్ట్ గా సెట్ అవుతుంది. ఇప్పటికే బాహుబలి సిరీస్ చిత్రాలతోపాటు ఆర్ ఆర్ ఆర్ తో వరల్డ్ వైడ్ గా ఉన్న సినీ ప్రియులను అలరించారు. ఇప్పుడు వారణాసి మూవీతో రాజమౌళి ప్రేక్షకులను నిరాశపరచడనే నమ్మకం అందరికీ ఉంది. కాబట్టి అటు రామాయణ.. ఇటు వారణాసి సినిమాలు రిలీజ్ అయ్యాక ఏం జరుగుతుందో వేచి చూడాలి.

బిగ్ బాస్ తెలుగు స్టార్ మరియు ఫ్యాషన్ ఐకాన్‌గా దివి వడ్త్యా మెరిసింది



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965